సాక్షి
గుంటూరు
సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



గంగాభవానీకి కాసు పూజలు

మాచవరం: కొత్తగణేశునిపాడులో నూతనంగా నిర్మించిన శ్రీగంగాభవానీ అమ్మవారి దేవాలయాన్ని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదివారం సందర్శించి, పూజలు చేశారు.



వైభవంగా పునఃప్రతిష్ట

క్రోసూరు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో దేవతామూర్తుల పునఃప్రతిష్టను ఆదివారం వైభోపేతంగా నిర్వహించారు. నంబూరు శంకరరావు పూజలు చేశారు.

అమ్మవారికి వెండి చీర, జాకెట్ బహూకరణ



తెనాలి: అమృతలూరు మండలం కూచిపూడిలోగల శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి రజిత పీఠ సహిత చీర, జాకెట్‌ను తెనాలికి చెందిన విశ్రాంత ఉద్యోగి దాసరి వెంకటరావు, కథా రచయిత్రి దాసరి శివకుమారి దంపతులు బహూకరించారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షుడిగా ఎమ్మెల్యే మద్దాళి



పట్నంబజారు:వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌ను పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడిగా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఆదివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువెడ్డాయి. ఆయన మాట్లాడుతూ గుంటూరు కార్పొరేషన్ పరిధి లోని గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో పదవినిచ్చిన సీఎం జగనన్న ఆదేశాలు తూచా తప్పకుండా శిరసావహిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరిని కలుపుకుని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తకలకు అందుబాటులో ఉంటూ, పార్టీ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు.

వైఎస్సార్ సీపీలో పదవులు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన పలువురుని పలు పదవుల్లో నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు ఆదివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా కొలకలూరి కోటేశ్వరరావు, అత్తోట జోసఫ్, సహాయ కార్యదర్శిగా చల్లా శేషిరెడ్డి, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా ఏటుకూరి విజయసారథిలను నియమించారు. పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా తాడిబోయిన వేణుగోపాల్‌రావు, సిరిబోయిన సుబ్బారావు, మైనారిటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షేక్ బాజీషహీద్, రాష్ట్ర సేవాదళ్ అధికారి ప్రతినిధిగా దానం వినోద్ బాబు, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వరికల్లు రవికుమార్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు తాడికొండలో సుచరిత నామినేషన్



తాడికొండ: వైఎస్సార్ సీపీ తాడికొండ అసెంబ్లీ అభ్యర్థి మేకతోటి సుచరిత సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. గుంటూరులోని నవభారత్ నగర్ 4వ లైన్ నుంచి విద్యానగర్, సాయిబాబా రోడ్డు, కొరిటెపాడు, లాడ్జి సెంటర్, నగరాలు, గోరంట్ల, లాం, తాడికొండ అడ్డరోడ్డు మీదుగా ర్యాలీగా వెళ్లి తాడికొండ ఎంపీడీవో కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. కార్యక్రమానికి 4 మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి డీఎడ్ సెమిస్టర్ పరీక్షలు

యడ్లపాడు: డీఎడ్ సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని బోయపాలెం ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం. సుభాని తెలిపారు. ఆదివారం పరీక్షల వివరాలను తెలియజేశారు. కళాశాలలో 2022-24 విద్యా సంవత్సరంలో అభ్యసించే విద్యార్థులకు మూడో సెమిస్టర్ పరీక్షలు మొదలవుతాయని పేర్కొన్నారు. 22న పెడగాగి ఆఫ్ ఇంగ్లిష్ ప్రైమరీ లెవల్-1, 23న పెడగాగి ఆఫ్ ఈవీఎస్ ఏట్ ప్రైమరీ లెవల్-1, 24న పెడగాగి ఆఫ్ ఎలిమెంటరీ లెవల్ ఆప్షనల్ సబ్జెక్టు, 25న కాన్‌టెంపరరీ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా -1, 26న ఇంటిగ్రేటింగ్ జండర్ అండ్ ఇన్‌క్లూజివ్ పర్స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, 27న స్కూల్ కల్చర్ లీడర్‌షిప్ అండ్ టీచర్ డెవలప్‌మెంట్ పరీక్షలు ఉంటాయని వివరించారు. 2023-25 విద్యార్థులకు ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు అదేరోజు ప్రారంభమవుతాయని వెల్లడించారు. 22న పెడగాగి ఆఫ్ మదర్‌టంగ్ (తెలుగు/ఉర్దూ/తమిళం), 23న పెడగాగి ఆఫ్ మాథ్స్ ఎట్ ప్రైమరీ లెవల్ -1, 24న పెడగాగి ఎక్రాస్ కరిక్యూలం అండ్ ఐసీటీ ఇంటిగ్రేషన్, 25న చైల్డ్‌హుడ్, చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ అండ్ లెర్నింగ్, 26న సొసైటీ, ఎడ్యుకేషన్ అండ్ కరిక్యులమ్, 27న ఎర్లీ చైల్డ్‌కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. థర్డ్ సెమిస్టర్‌ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, ఫస్ట్ సెమిస్టర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు. గతంలో సబ్జెక్టులు మిగిలిన వారు కూడా ఇదే పరీక్ష సమయంలో ఆయా బ్యాచ్‌లతో హాజరై పరీక్షలు రాయవచ్చని సూచించారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

క్రోసూరు:స్థానిలో ఏపీ మోడల్ స్కూలులో ఆదివారం ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్స్‌పాల్ ఎం.మేరీ సుజన్ తెలిపారు. 258 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 237 మంది హాజరైనట్లు తెలిపారు.







ప్రచార పర్వం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు అనంతరం అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గుంటూరు ముత్యాలరెడ్డి నగర్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ గుంటూరు వెస్ట్ అభ్యర్థి విడదల రజిని బజ్జీలు వేస్తూ ఓటర్లను ఆకర్షించారు. అలాగే లాంలో పర్యటించిన తాడికొండ అభ్యర్థి మేకతోటి సుచరితపై స్థానికులు అభిమాల పూలజల్లు కురిపించారు. గుంటూరు ఈస్ట్ అభ్యర్థి నూరి ఫాతిమా ఐపీడీలో కాలనీలో ప్రచారం చేస్తూ స్థానిక ఓ బండివద్ద దోసెలు వేసి సందడి చేశారు.

టీడీపీ అత్యుత్సాహం

- రాజధాని పర్యటన పేరుతో హడావుడి
- సానుభూతి ఓట్ల కోసం పాకులాట
- అమరావతి అభివృద్ధి ప్రణాళిక ధ్వంసం అంటూ ప్రచారం
- 2022లోనే వీటిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసుల నిర్ధారణ



గ్యాలరీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పెమ్మసాని, శ్రావణ్(ఫైల్)

తాడికొండ: టీడీపీ నాయకులు సానుభూతి కోసం పాకులాడుతున్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో తమకు ఓట్లు రావనే నిర్ధారణకు వచ్చిన నేతలు హడావుడి చేశారు. ఈ నెల 17వ తేదీన రాజధాని పర్యటన పేరుతో గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో ఏర్పాటు చేసిన అమరావతి ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. రాజధాని నిర్మాణానికి సంబంధించిన బృహత్తర ప్రణాళికను ధ్వంసం చేశారంటూ ఎల్లో మీడియా, సోషల్ మీడియా, ట్విట్టర్ వేదికగా ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్, రాజధాని రైతుల ముసుగులో ఉన్న టీడీపీ నాయకులు ఆరోపణలు చేశారు. ప్రభుత్వ యంత్రాంగం గాలి కొదిలేయడంతో అసాంఘిక శక్తులు ధ్వంసం చేశాయంటూ నానా హంగామా చేశారు. అమరావతిపై కుట్ర జరిగిందంటూ మరికొందరు హడావుడి చేసి ఎల్లో మీడియాలో లేనిది ఉన్నట్లు ప్రచారం చేశారు.

2022లోనే కేసు నమోదు

వాస్తవానికి ఇక్కడ 2022 ఆగస్టులోనే ధ్వంసం జరిగిందంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు క్రైం నెంబర్ 203/22, 211/22 పేరుతో కేసులు నమోదు చేసినట్లు తుళ్లూరు డీఎస్పీ ఈ అశోక్‌గౌడ్ స్వయంగా వెల్లడించారు. నాటి నుంచి నేటి వరకు ఈ ప్రాంతాన్ని కన్నెత్తి చూడని టీడీపీ నాయకులకు ఇప్పటికిప్పుడు అమరావతిపై ప్రేమ ముంచుకొచ్చింది. ఇప్పటికిప్పుడు ధ్వంసం చేసిన ఆనవాళ్లు ఏమీ కనిపించడం లేదని అందుకు సంబంధించి ఆధారాలతో సహా తమకు ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రకటించారు.

గాలి కబుర్లతో రెచ్చగొట్టేందుకే..

అమరావతి రాజధానిని సింగపూర్, జపాన్, మలేషియా, అమెరికాల కంటే పెద్దదిగా అభివృద్ధి చేస్తామని చెప్పి తాత్కాలికం పేరుతో పబ్బంగడిపారు. ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన రైతుల కోసం బాబు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన జగనన్న వారికి కౌలు పరిహారం చెల్లించడంతోపాటు భూమిలేని నిరుపేదలకు గత ప్రభుత్వం అందించిన రూ.2,500 పింఛన్‌ను రూ.5,000 చేసిందని రాజధాని ప్రాంతంలోని తుళ్లూరు మండలంలో 8000 మంది, మంగళగిరి తాడేపల్లి ప్రాంతంలో తొమ్మిది వేల మంది కలిపి మొత్తం 17 వేల మంది నిరుపేదలు లబ్ధి పొందుతున్నారు. వీరంతా సంతృప్తిగా ఉన్నప్పటికీ లేనిపోని గాలికబుర్లు చెబుతూ టీడీపీ నాయకులు ఓటమి భయంతో చేస్తున్న షోలు చూసి నవ్వుకుంటున్నారు.

టీడీపీ పశ్చిమ అభ్యర్థి మాధవిపై రెండు కేసులు

- ఆమె పేరుతో పెద్దఎత్తున స్థిర, చరాస్తులు
- అఫిడవిట్‌లో పొందుపర్చిన వివరాలు
- అప్పులు కూడా ఉన్నాయంట

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గల్లా మాధవిపై ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ప్రచారం నిర్వహించినందుకు రెండు పోలీసు కేసులు నమోదయ్యాయి. టీడీపీ అభ్యర్థిగా శనివారం నామినేషన్ వేసిన గల్లా మాధవి ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో పోలీసు కేసుల వివరాలతోపాటు పెద్ద ఎత్తున స్థిర, చరాస్తులకు సంబంధించిన వివరాలు చూపారు. భ్రమర టౌన్‌షిప్స్ అధినేత అయిన మాధవి భర్త గల్లా రామచంద్రరావు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వెంచర్లు వేశారు. మాధవి ఎంసీఏ చదివారు. వీరికి ఇద్దరు పిల్లలు అమూల్య లక్ష్మి, శివ ఆదిత్య ఉన్నారు. గల్లా మాధవి, రామచంద్రరావు పేరుతో గరికపాడు, మార్కాపురం, బొద్దువానిపాలెం, కొర్నెపాడు, పోరంకి, పిడుగురాళ్ల, తిమ్మాయపాలెం, తుళ్లూరు, పెదపరిమి, విద్యానగర్ ఎక్స్‌టెన్షన్, చినకాకానిలో పెద్దఎత్తున భూములు ఉన్నాయి. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.9.25 కోట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో పొందుపర్చారు. కొరిటెపాడు, జీటీ రోడ్డులో రెండు ఇళ్లు ఉన్నాయి. బంగారు ఆభరణాలతో కలుపుకుని స్థిరాస్తులు రూ.7.36 కోట్లుగా చూపారు. తన పేరుతో అప్పులు రూ.1.59 కోట్లు, భర్త పేరుతో మరో రూ.10.25 కోట్లు ఉన్నట్లు లెక్కలు తేల్చారు. నగదు రూపంలో తన వద్ద కేవలం రూ.4.02 లక్షలు, తన భర్త వద్ద రూ.4.13 లక్షలు ఉన్నట్లు చూపారు. దీంతో పాటు ఆమె గుంటూరులోని వికాస్ హాస్పిటల్స్‌కు డైరెక్టర్‌గాను వ్యవహరిస్తున్నారు.

రజిని ఆస్తుల విలువ రూ.6.39 కోట్లు

నెహ్రూనగర్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంత్రి విడదల రజిని ఆమె ఆస్తి వివరాలతో, ఇతర వివరాలను అఫిడవిట్‌లో పొందుపరిచారు. మొత్తం స్థిర, చర ఆస్తులు కలిపి రూ6.39 కోట్లుగా అఫిడవిడ్‌లో చూపారు. భర్త చరాస్తి విలువ రూ.53.03కోట్లు, కుమారుడు పేరు మీద రూ.27లక్షలు, కూమార్తె పేరు మీద రూ.7లక్షలుగా చూపారు. బంగారం 600గ్రాములు, భర్త పేరు మీద 300గ్రాములు, పిల్లల పేరు మీద 100గ్రాములుగా చూపారు. విద్యార్హత బీఎస్సీగా చూపారు.

కొలువుల భర్తీ..సేవల విస్తృతి



గుంటూరు వైద్య కళాశాల, జీజీహెచ్ దశ, దిశ మార్చిన సీఎం జగన్

- వార్డుబాయ్ నుంచి వైద్యుని వరకు ఖాళీల భర్తీ
- ఆస్పత్రి, కళాశాల చరిత్రలో ఒకేసారి అత్యధిక కొలువులు
- అదనంగా మెడికల్ యూనిట్లు , కొత్తగా విభాగాలు మంజూరు
- తాజాగా మరో 114 పోస్టుల నియామకానికి పచ్చజెండా
- పరిపాలన సౌలభ్యం కోసం డెప్యూటీ కలెక్టర్ పోస్టు మంజూరు
- సామాన్యులకు మరింత మెరుగైన వైద్యం

గుంటూరు మెడికల్ : గుంటూరు వైద్య కళాశాల, జీజీహెచ్ లో వార్డు బాయ్ నుంచి వైద్యుల వరకు...అదనపు వైద్య యూనిట్ల నుంచి కొత్త విభాగాల ఏర్పాటు వరకు పరికిస్తే...2018కు ముందు 2019 అనంతరం అని చెప్పుకోవచ్చు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గుంటూరు వైద్య కళాశాల, జీజీహెచ్‌లో కొలువుల భర్తీ విప్లవం వచ్చింది. 2019కు ముందు ఆసుపత్రిలో అన్ని విభాగాల వారీ ఖాళీలుండేవి. వాటన్నింటినీ దశలవారీ భర్తీ చేస్తూ సేవలను మరింత విస్తృతం చేయడంలో తనదైన ముద్ర వేసుకున్నారు.

జీజీహెచ్, వైద్య కళాశాల ప్రారంభం నుంచి ఎన్నడూ లేని విధంగా ఒకేసారి అన్ని కేడర్ల వైద్య సిబ్బంది నియామకాలను ప్రభుత్వం చేపట్టింది. సూపర్‌స్పెషాలిటి వైద్యులు సైతం ఒకేసారి అధిక సంఖ్యలో చేరటంతో వైద్య సిబ్బంది నియామకాల్లో సరికొత్త రికార్డు నెలకొల్పింది. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వైద్య విద్యను బలోపేతం చేసేలా చర్యలు తీసుకున్నారు. 78 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కల్గిన ఆస్పత్రి, వైద్య కళాశాలలో నూతన విభాగాలను ఏర్పాటుచేయటంతోపాటు అదనంగా మెడికల్ యూనిట్లును నెలకొల్పారు. 2023 నవంబర్‌లో జీజీహెచ్, వైద్య కళాశాలలో 114 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది.పరిపాలన పరమైన అంశాల్లో ఆస్పత్రి అధికారులకు మద్దతుగా డిప్యూటీ కలెక్టర్‌ను సైతం ప్రభుత్వం గత నెలలో నియమించింది.

రెండేళ్లలో 66 పీజీ సీట్లు

గుంటూరు వైద్య కళాశాల ప్లాటినం జూబ్లి వేడుకలు జరుగుతున్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య కళాశాలపై వరాల జల్లు కురిపించింది. పేద వైద్య విద్యార్థులు స్పెషాలిటి, సూపర్ స్పెషాలిటి పీజీ సీట్లు ఉచితంగా చదువుకునేలా 2022 సంవత్సరంలో 40 సీట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. పీజీ సీట్ల మంజూరుకు ప్రభుత్వం ప్రత్యేకంగా సిబ్బంది, వైద్యుల నియామకాల చేపట్టింది. అంతటితో ఆగకుండా వసతుల కల్పన, వైద్య పరికరాల కొనుగోలుకు రూ.40 కోట్లు మంజూరు చేసింది. 2023లో 22 పీజీ సీట్లు మొత్తం రెండేళ్లలో 66 పీజీ సీట్లు వచ్చాయి.

అన్ని కేడర్ల వైద్య సిబ్బంది నియామకాలు...

పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని న్ని ఉచితంగా అందించాలనే లక్ష్యంతో.. ఆసుపత్రి చరిత్రలోనే తొలిసారి ప్రిన్సిపాల్ హోదాను అదనపు డీఎంఈగా ఉన్నతీకరించి రెగ్యులర్ ప్రిన్సిపాల్ గా నియమించింది. ఇలా చేయడం ద్వారా పీజీ, ఎంబీబీఎస్ సీట్ల తనిఖీలకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎమ్‌సీ) వచ్చిన సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా వెసులుబాటు కలిగింది. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్లు చెరో 15, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 31 ప్రభుత్వం మంజూరు చేసింది. ఏ ఒక్క కొలువును ఖాళీగా ఉంచకుండా నెలనెలా నియామకాలు చేపట్టింది.

ఆస్పత్రిలో 2020లో ఒకేసారి కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సు పోస్టులను 250 ప్రభుత్వం మంజూరు చేసింది. 2023 డిసెంబర్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో 30 మంది స్టాఫ్‌నర్సులను, ఎన్ఆర్‌సీ సెంటర్‌లో 34 మంది , రెగ్యులర్‌హెడ్ నర్సులు-15, రెగ్యులర్ స్టాఫ్‌నర్సులు-18, గ్రేడ్ -1 నర్సింగ్ సూపరింటెండెంట్, గ్రేడ్-2 సూపరింటెండెంట్‌లను సైతం నియమించింది. ఫార్మాసిస్టు , ల్యాబ్ టెక్నీషియన్, రిసెప్షనిస్ట్, క్లర్క్, ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓలను భర్తీ చేసింది.

నూతన వైద్య విభాగాల ఏర్పాటు...

ఆసుపత్రి పరిపాలన కోర్సును 2020లో నూతనంగా ప్రారంభించారు. మెరుగైన పాలన అందించడంలో ఈ విభాగంలో చేరిన వైద్యుల పాత్ర కీలకం. ఎమర్జెన్సీ మెడిసిన్ రాకతో అత్యవసర వైద్యసేవలు త్వరితగతిన బాధితులకు అందుతున్నాయి. సర్జికల్ అంకాలజీ, రేడియేషన్ అంకాలజీ, నూతన విభాగాల ఏర్పాటుతో క్యాన్సర్ బాధితులకు కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే ప్రభుత్వం రూ. 16 కోట్ల ఖరీదైన లీనియర్ యాక్సిలేటర్ పరికరాన్ని జీజీహెచ్‌లో ఏర్పాటు చేయించింది. నాట్కో ట్రస్టు సుమారు రూ. 30 కోట్లతో ఐదంతస్తుల క్యాన్సర్ భవనం నిర్మించింది. న్యూరోసర్జరీ, యూరాలజీ విభాగాల్లో అదనంగా యూనిట్లను మంజూరు చేయడంతో పాటు కొత్తగా సూపర్‌స్పెషాలిటి వైద్యులను నియమించింది.

పదోన్నతుల వెల్లువ

పుష్కర లం నుంచి పదోన్నతులు లేక నైరాశ్యంలో ఉన్న వైద్య సిబ్బందికి ఈ ఐదేళ్లలో జోష్ లభించింది. పలువురు ప్రొఫెసర్లు అదనపు డీఎంఈలుగానూ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. స్టాఫ్‌నర్సులు హెడ్ నర్సులుగా, హెడ్ నర్సులు నర్సింగ్ సూపరింటెండెంట్‌లుగా, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లు గ్రేడ్ -1 నర్సింగ్ సూపరింటెండెంట్‌లుగా ప్రమోషన్లు పొందారు.

వైద్య విద్య బలోపేతం కోసం



వైద్య కళాశాలలో నూతనంగా విభాగాలు, యూనిట్లను ప్రభుత్వం ప్రారంభించింది. దీని ద్వారా పలువురు పీజీ వైద్యులు కళాశాలలో చేరే అవకాశం ఏర్పడింది. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అధిక మొత్తంలో విధుల్లో చేరటంతో వైద్య విద్యార్థులకు మెరుగైన బోధన అందుతోంది.

– డాక్టర్ టీటీకె రెడ్డి, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్

రోగులకు మెరుగైన వైద్యం....



నూతన ఐసీయూ ఏర్పాటుతో అత్యవసర వైద్యసేవలు సైతం బాగా అందుతున్నాయి.గుండె బైపాస్ సర్జరీలు, కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు, అత్యంత అరుదైన ఆపరేషన్లు నిరుపేదలకు ఉచితంగా చేస్తున్నాం. పలు భవనాల నిర్మాణాలు, వార్డుల ఆధునికీకరణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్

బడి చదువుకు సాంకేతిక బలం

- బైజూస్ కంటెంట్‌తో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్యాబ్‌లు
- ఇంగ్లిష్ మీడియంకు తోడైన సాంకేతిక పరిజ్ఞానం
- విద్యా రంగంలో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక మార్పులు
- జిల్లాలో రెండేళ్లలో 24,608 మంది విద్యార్థులకు అందజేత
- రూ.81.20 కోట్లు వెచ్చించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

గుంటూరు ఎడ్యుకేషన్: పలకా బలపం నుంచి సర్కార్ బడుల్లో మొదలైన ప్రాథమిక విద్య.. పెన్నూ పేపరుతో ఉన్నత పాఠశాల విద్య పూర్తయ్యేది. మా తెలుగు తల్లికి వందనం అంటూ.. పూర్తిగా మాతృ భాషలోనే పాఠశాల విద్యను పూర్తి చేసిన విద్యార్థులు అనంతరం ఉన్నత చదువుల్లో ఇంగ్లిష్ మీడియాన్ని అందుకునేందుకు ఒకింత ఇబ్బంది పడేవారు. కంప్యూటర్ శిక్షణ, సాంకేతిక విద్య అనేది అందని ద్రాక్షే. ఇది గతం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మాతృ భాషకు ప్రాధాన్యమిస్తూనే.. ఇంగ్లిష్ మీడియంను తీసుకొచ్చింది. సాంకేతిక విద్యను అందిపుచ్చుకునేందుకు 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందజేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు దానిని అందిపుచ్చుకుంటున్నారు. తరగతి గదిలో బ్లాక్ బోర్డుపై రాసేందుకు చాక్ పీస్ ముక్కలు లేని దీనమైన పరిస్థితుల నుంచి ప్రస్తుతం ఆధునిక సౌకర్యాలతో కూడిన సాంకేతి విద్యను విద్యార్థులు ఉచితంగా అందుకుంటున్న పరిస్థితితుల్లో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. విద్యా వ్యవస్థలో గతంలో ఎన్నడూ చూడని మార్పులను సీఎం వైఎస్ జగన్ తీసుకొచ్చిన తీరును సమాజం చూస్తోంది. వసతుల లేమి, సమస్యలతో కునారిల్లుతున్న సర్కారు బడులను నాడు-నేడు కార్యక్రమం ద్వారా సర్వాంగ సుందరంగా ఆధునీకరించి, పేద విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతున్నారు.

రెండేళ్లలో 24,608 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు

గుంటూరు జిల్లాలోని 181 ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లను ఉచితంగా పంపిణీ చేసింది. 2022-23 విద్యా సంవత్సరంలో 12,127 మంది, 2023-24లో 12,481 మంది విద్యార్థులు ట్యాబ్‌లు అందుకున్నారు. క్యారీయింగ్ కేస్, ఓటీజీ కేబుల్, మెమోరీ కార్డు, బైజూస్ కంటెంట్‌తో కలిపి ఒక్కో విద్యార్థికి రూ.33వేలు వ్యయంతో ట్యాబ్‌ను అందించింది. ఈ విధంగా రెండేళ్లలో గుంటూరు జిల్లాలోని 24,608 మంది విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీకి రూ.81.20కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది.

చదువు విలువ తెలిసిన సీఎం జగన్ సార్



మాది మధ్య తరగతి కుటుంబం. నా భర్త దుర్గాసింగ్ ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్నారు. మా కొడుకుని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నాం. ఏటా మాకు అమ్మ ఒడి పథక కింద నగదు అందుతోంది. పిల్లలకు విద్యా కానుక కిట్‌తో పాటు పాఠశాలలోనే గోరుముద్ద పేరుతో పౌష్టికాహారంతో కూడి మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. ఇప్పుడు ట్యాబ్‌ను ఉచితంగా ఇవ్వడం ద్వారా సీఎం జగన్ సార్ చదువుకు ఎంతటి ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థమవుతోంది.

– మీరాబాయి, విద్యార్థి శివలక్ష్మణ్ తల్లి

ట్యాబ్‌తో పరిజ్ఞానం పెంపు



మా నాన్న శ్రీను ఆటో డ్రైవర్. ఐదో తరగతి వరకు ప్రైవేటు స్కూల్లో చదివించారు. అక్కడ ఫీజులు కట్టలేక అమ్మా నాన్న చాలా ఇబ్బందులు పడ్డారు. ఆరో తరగతిలో గుంటూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఇక్కడ వసతులు ఎంతో బాగున్నాయి. ట్యాబ్‌ను ఉచితంగా ఇచ్చారు. అందులోని కంటెంట్‌తో జ్ఞానం పెంపొందించుకోవచ్చు.

– ఎ.చందన, 8వ తరగతి

సాంకేతిక చదువుకు దోహదం



మా నాన్న నజీర్ బైక్ మెకానిక్. ప్రైవేటు స్కూల్లో చదివించే స్తోమత లేక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఇక్కడ ప్రైవేటు స్కూల్ కంటే ఎంతో మెరుగైన వసతులు ఉన్నాయి. సీఎం జగన్ మామయ్య ఇచ్చిన ట్యాబ్ సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవడానికి ఎంతో ఉపయోగపడుతోంది.

–షేక్ ఆఫ్రీన్, 8వ తరగతి విద్యార్థిని



గుంటూరు కేవీపీ కాలనీలోని ఓ మున్సిపల్ హైస్కూలులో ట్యాబ్‌లతో విద్యార్థులు (ఫైల్)

క్లుప్తంగా

ఆరున్నర కిలోల వెండి స్వాధీనం

తెనాలిరూరల్: ఆరున్నర కిలోల వెండిని చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. పట్టణంలోని ఓ వెండి వస్తువులు తయారు చేసే దుకాణంలో పని చేసే వ్యక్తి విజయవాడ నుంచి శనివారం రాత్రి ఆర్టీసీ బస్సులో వెండిని తీసుకువస్తున్నాడు. తెనాలి మండలం నందివెలుగు ప్రధాన జంక్షను వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో పోలీసులు బస్సు తనిఖీ చేశారు. వెండిని గుర్తించి పోలీసులు సీజ్ చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వెండి ఎందుకు, ఎక్కడ నుండి తరలిస్తున్నాడన్న విషయాన్ని పరిశీలిస్తున్నామని, అన్ని అంశాలను నిర్ధారించుకుని పత్రాలు సరిగా ఉంటే తిరిగి ఇచ్చేస్తామని పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫైరింగ్ పోటీలకు జగదీశ్వరి ఎంపిక



చీరాల టౌన్: 23వ ఆంధ్రా బెటాలియన్ పరిధిలోని చీరాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ వై.జగదీశ్వరి రాష్ట్రస్థాయి ఫైరింగ్ పోటీలకు ఎంపికైందని కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు గ్రూపు పరిధిలో నిర్వహించిన రైఫిల్ ఫైరింగ్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన జగదీశ్వరి మే 3 నుంచి 13 వరకు జరిగే ఏపీ, తెలంగాణ ఫైరింగ్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. నర్సరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న జగదీశ్వరి పోటీలకు ఎంపికవ్వడంపై సుబేదార్ మేజర్ ముఖేష్‌కుమార్, సుబేదార్ సత్యంద్రసింగ్, హవల్దార్ మేజర్ రమేష్, ఎన్‌సీసీ ఆఫీసర్ రాజేష్‌లు అభినందించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



చీరాల రూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం వేటపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. వేటపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో వస్తున్న రైలును గమనించకుండా పట్టాలు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందని, మృతుని శరీరంపై తెలుపు, నలుపు రంగు గీతలు కలిగిన పింక్ కలర్ ఫుల్‌హ్యాండ్ షర్ట్, స్కై బ్లూ రంగు కలిగిన జీన్ ప్యాంటు ఉన్నట్లు చెప్పారు. అయితే మృతుని వద్ద ఎటువంటి సమాచారం లభించలేదని, మృతుడి వివరాలు తెలిసినవారు జీఆర్పీ ఎస్ఐ 94406 27646 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు.

అందరి ఆత్మీయ బంధువు జగనన్న...

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో 40 మంది చేరిక
- కాంగ్రెస్ పార్టీ, జనసేనల నుంచి మరో 20 మంది..



పార్టీలో చేరిన నాయకులతో మంత్రి విడదల రజిని

పట్నంబజారు: కుల చూడం.. మతం చూడం.. ప్రాంతం చూడమని.. పార్టీ చూడమని చెప్పి అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికి ఆత్మ బంధువయ్యారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ అసెంబ్లీ అభ్యర్థి విడదల రజిని చెప్పారు. గుంటూరు చంద్రమౌళి నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం 44వ డివిజన్ నుంచి టీడీపీకి చెందిన సుమారు 40 మంది ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 50 శాతం ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారని, రాజకీయంగా అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, ఉన్నత పదవులు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 44వ డివిజన్ నాయకులు వంగల వలివీరారెడ్డి ఆధ్వర్యంలో ఆ డివిజన్‌కు చెందిన ఎస్సీ నాయకులు సాగర్, కిరణ్, శ్యామ్ నాయకత్వంలో 35 మంది వైఎస్సార్ సీపీలో చేరారు.

కాంగ్రెస్, జనసేనల నుంచి...

కాంగ్రెస్‌పార్టీ, జనసేనల నుంచి 20 మంది నాయకులు ఆదివారం విడదల రజిని నివాసంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కాంగ్రెస్‌పార్టీ గుంటూరు నగర ఉపాధ్యక్షుడు కాటమాను బాబూరావు, బ్రాహ్మణ సంఘం నాయకులు రామరాజు కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ నగర చైర్మన్ ఎం.శివశంకర్, మైనారిటీ సెల్ నగర చైర్మన్ ఎస్‌కే జుబేర్, జిల్లా కిసాన్ అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, 31,34,35,36 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాకనాటి వెంకటరావు, షేక్ ఇనాయతుల్లా, డి.పద్మావతి, ఎస్‌కే బాజీబాషా ఉన్నారు. జనసేన 32వ డివిజన్ ఉపాధ్యక్షుడు అరవింద్ జైశ్‌తోపాటు పలువురు ఆ పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పుకున్నారు.

మళ్లీ జగనన్న సీఎం అయితేనే పేదలకు మేలు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

- మేకతోటి సుచరిత
- రాయపూడిలో టీడీపీ, కాంగ్రెస్ నుంచి భారీగా వైఎస్సార్ సీపీలో చేరిక

తాడికొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే పేదలకు మేలు అని ప్రతిపాదు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి మేకతోటి సుచరిత పేర్కొన్నారు. తుళ్లూరు మండలం రాయపూడిలో తెలుగుదేశం పార్టీ, కాంగ్రెస్ పార్టీ నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. 30 కుటుంబాలకు పైగా ఆయా పార్టీలకు చెందిన నాయకులకు గుంటూరులోని ఎమ్మెల్యే సుచరిత కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు పేదల కుటుంబాల్లో వెలుగులు నింపాయని చెప్పారు. ఆయనొక్కడే పేదల కష్టానికి తగిన ఆదరణ చూపిస్తున్నాడనేందుకు ఐదేళ్ల పాలనే నిదర్శనమన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని హామీలు నెరవేర్చిన జగనన్న మళ్లీ అధికారంలోకి వస్తేనే పేదల బతుకులు బాగుపడతాయని, తామంతా వైఎస్సార్ సీపీలోకి చేరినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాయపూడి గ్రామ నాయకులు షేక్ జానీ బాషా, విద్యార్థి విభాగం నాయకులు దానం వినోద్ పాల్గొన్నారు.

రసవత్తరంగా బాస్కెట్‌బాల్ పోటీలు

నూజివీడు: పట్టణంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఏపీ స్టేట్ 9వ అంతర్ జిల్లాల జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. బాలికల విభాగంలో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, అనంతపురం జిల్లా జట్లు సెమీస్‌కు చేరాయి. అలాగే బాలుర విభాగంలో లీగ్ పోటీలు ముగిసి క్వార్టర్ ఫైనల్స్ నిర్వహిస్తున్నారు. క్వార్టర్ ఫైనల్స్‌లోకి తూర్పు గోదావరి, గుంటూరు, కర్నూలు, వైజాగ్, అనంతపురం, నెల్లూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జట్లు చేరాయి. కర్నూలు– వైజాగ్ జట్ల మధ్య మ్యాచ్ ముగిసే సమయానికి 48– 48 స్కోర్‌తో సమానంగా నిలవడంతో అదనపు సమయం ఇచ్చి మ్యాచ్ కొనసాగించారు. ఈ ఉత్కంఠ పోరులో వైజాగ్ జట్టు కర్నూలు జట్టుపై 57– 55 స్కోర్ తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డాక్టర్ దక్షిణామూర్తికి 'ది ప్రైడ్ ఆఫ్ తెనాలి' అవార్డు ప్రదానం



డాక్టర్ దక్షిణామూర్తికి ది ప్రైడ్ ఆఫ్ తెనాలి అవార్డుతో సన్మానిస్తున్న దృశ్యం

తెనాలి: వైద్యోనారాయణో హరిః అనే మాటకు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి ప్రతిరూపమని, 'ది ప్రైడ్ ఆఫ్ తెనాలి'తో సత్కరించటం సముచితమని అజో–విభో–కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అప్పాజోస్యుల సత్యనారాయణ అన్నారు. కళల కాణాచి– తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్– విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో ఏర్పాటైన సభకు కళల కాణాచి ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించారు. సంస్థ ఆధ్వర్యంలో ది ప్రైడ్ ఆఫ్ ఇండియా తొలి అవార్డును పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు, రచయిత, చైతన్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తికి ప్రదానం చేశారు. కళల కాణాచి వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ డాక్టర్ దక్షిణామూర్తి ఎంత గొప్ప వైద్యులో...అంత గొప్ప మనిషిగా చెప్పారు. దక్షిణామూర్తి నా బిడ్డ అంటూ తెనాలి గడ్డ గర్వంగా చెప్పుకోదగిన వ్యక్తిగా పేర్కొన్నారు. ప్రముఖ రచయిత, పరిశోధనకుడు ముత్తేవి రవీంద్రనాథ్, డాక్టర్ దక్షిణామూర్తి జీవిత విశేషాలను వివరించారు.

ఆలోచింపజేసిన 'గో టు హెల్' నాటకం...

సభానంతరం ప్రఖ్యాత నటుడు, రచయిత దివంగత గొల్లపూడి మారుతీరావు రచించిన 'గో టు హెల్' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. రసఝరి, పొన్నూరు నాటక సమాజం ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటకానికి రంగస్థల, సినీనటుడు వై.కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించారు. గో టు హెల్ నాటక ప్రదర్శన ప్రఖ్యాత రంగస్థల నటుడు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి నటించిన చివరి నాటక ప్రదర్శన 'గో టు హెల్' అని, అందులో ఆయన, తాను తండ్రీకొడుకులుగా నటించినట్టు కృష్ణేశ్వరరావు గుర్తుచేసుకున్నారు. నాటకరంగ పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు మాట్లాడారు. వివిధ పాత్రల్లో ఆచార్య అక్కిరాజు సుందర రామకృష్ణ, జి.కుసుమసాయి, ఎస్.సూర్య, ఈ.భాగ్యరాజ్, పి.నాగరాజేష్, బీకేఎస్ఎస్ ప్రసాద్, రూపశ్రీ నటించారు. సంగీతం తబలా బాబు, ఆహార్యం పి.శ్రీధర్, లైటింగ్ సురభి సంతోష్.

వైఎస్సార్ సీపీ నాయకులపై టీడీపీ నేతల దాడి

ఒకరికి తీవ్రంగా.. ఇద్దరికి స్వల్ప గాయాలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న విజయ్, శామ్యూల్, సుశీల

మాచర్ల రూరల్: 'మా పల్లెలో వైఎస్సార్ సీపీ జెండా కట్టి మాకెదురుగా ప్రచారం నిర్వహిస్తూ ఓట్లు అడిగేంత దమ్ము, ధైర్యం మీకెక్కడి నుంచి వచ్చిందిరా.' అంటూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై విచక్షణారహితంగా దాడి చేసి, గాయపర్చిన ఘటన ఆదివారం మండలంలోని రాయవరం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు.. గ్రామంలోని ఎస్సీ పల్లెలో పేరుపోగు విజయ్‌కుమార్, పొన్నాల శామ్యూల, పేరుపోగు సుశీల తదితరులు సోమవారం పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నామినేషన్ వేయనున్నారని కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. అక్కడే ఉన్న టీడీపీకి చెందిన పెనుపాటి అంజి, పెనుపాటి ఏసోబు మాష్టారు, రమేష్, ఉదయ్ కుమార్, మేరిబాబు, దాసు, చిన ఏసోబు ఒక్కసారిగా వారిపై దాడి చేశారు. వైఎస్సార్ సీపీ తరపున ప్రచారం చేసినా, జెండా పట్టుకున్నా కాళ్లు విరగ్గొడతామంటూ కర్రలతో కొట్టడంతో విజయ్‌కుమార్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. పొన్నాల శామ్యూల్, పేరుపోగు సుశీలకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించి, విజయ్‌కుమార్‌ను నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీ మారి బలిపశువు అయిన 'జంగా'

సమావేశంలో బీసీ సంఘాల నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

నరసరావుపేట: గురజాల బీసీ నాయకుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలో చేరి బలిపశువు అయ్యారని పలు బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి కార్యాలయంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. శనివారం దుర్గి గ్రామంలో నిర్వహించిన టీడీపీ బీసీ సదస్సులో పాల్గొన్న జంగా.. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్ కుమార్‌యాదవ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. మతోన్మాద పార్టీతో కూడిన కూటమితో కలసి 'జంగా' బలిపశువు అయ్యారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీలో ఉండగా పదిమందిలో ఒకడిగా ఉన్నారని, కూటమిలోకి వెళ్లి వందలో ఒకడిగా ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలు అందరూ అనిల్‌కుమార్‌యాదవ్ విజయానికి కృషిచేస్తామని ముక్త కంఠంతో ప్రకటించారు. సమావేశంలో ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ స్వామి, జిల్లా బీసీ వెల్ఫేర్ జేఏసీ కార్యదర్శి బొందిలి శ్రీనివాస్‌సింగ్, మహిళా అధ్యక్షురాలు టి.మంగమ్మ అంజియ్య, సీనియర్ బీసీ సంఘ నాయకులు బోయిన సుబ్బారావు, త్రికోటేశ్వరస్వామి ఆలయ పాలక మండలి సభ్యుడు అట్లూరి బాలాసుబ్రహ్మణ్యం నాయీ, ఉమ్మడి గుంటూరు జిల్లా ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, బీసీ వెల్ఫేర్ జేఏసీ కోశాధికారి రాంబాబు, నాయకులు గాడిల్లి సాంబశివరావు, మాజీ కౌన్సిలర్ కారుమంచి మీరావాలి, రావూరి కోటేశ్వరరావు, షేక్ గాలిబ్, సీహెచ్ శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరికలు

వైఎస్సార్ సీపీ లోక్‌సభ అభ్యర్థి, ఎమ్మెల్యే కిలారి రోశయ్య



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై.. ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ వైపు మొగ్గు చూపుతున్నారని వైఎస్సార్ సీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య చెప్పారు. కృష్ణనగర్‌లోని ఆయన నివాసంలో ఆదివారం పాత గుంటూరు, ఆనంద్‌పేటలకు చెందిన 75 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రోశయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టి.. వాటిని అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతోందని పేర్కొన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా ఐదేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో అందజేసి, ప్రజల గుండెల్లో చెరగని, తరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఇటువంటి గొప్ప పాలనలో నేను భాగస్వామిని కావటం ఎంతో గర్వకారణంగా ఉందని వివరించారు. జగనన్న పాలన అంటే ఏమిటో అర్థంకాని పెత్తందారులు విమర్శలు చేయటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. తమ పాలనలో ఎంత మంచి జరిగిందో.. పేదలకు ఎంత మేలు చేశారో.. ఆ ఫలాలు పొందిన వారికి తెలుసన్నారు. మంచి చేసే ప్రభుత్వానికి, నాయకులకు ప్రజల అండదండలు ఎప్పుడూ ఉంటాయన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపు ఇచ్చారు.

మళ్లీ వైఎస్ జగన్ పాలన కోరుకుంటున్న ప్రజలు

- పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- వైఎస్సార్ సీపీలో భారీగా ముస్లింల చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనను మళ్లీ ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. ముస్లిం నాయకుడు షేక్ నాజర్ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ సెంటర్‌లోని ఆయన కార్యాలయం వద్ద 4,5 వార్డులకు చెందిన 50 మంది ముస్లింలు అంబటి మురళీకృష్ణ సమక్షంలో ఆదివారం చేరారు. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ పొన్నూరులో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాలుగో వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ షర్మిల, పార్టీ నాయకులు మొల్ల కరీం, ఫజరుల్ల, మురళి, రవికుమార్, నాజర్ యూత్ పాల్గొన్నారు.

దూర విద్యలో ఇగ్నో ఆధునిక కోర్సులు



మాట్లాడుతున్న ఇగ్నో ప్రాంతీయ కేంద్ర ఉప సంచాలకులు సుమలత

గుంటూరు ఎడ్యుకేషన్ : దూర విద్యా విధానంలో ఇగ్నో ఆధునిక కోర్సులు ప్రవేశపెట్టిందని ప్రాంతీయ కేంద్ర ఉప సంచాలకులు కె.సుమలత తెలిపారు. ఆదివారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయ (ఇగ్నో) అధ్యయన కేంద్రంలో నూతన విద్యాకోర్సులపై ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుమలత మాట్లాడుతూ టీజేపీఎస్ కళాశాలలో 1987 నుంచి అధ్యయన కేంద్రం కొనసాగుతోందన్నారు. దేశ వ్యాప్తంగా 500 కేంద్రాలు, 58 కోర్సులతో దూర విద్యా విధానంలో ఇగ్నో అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. విద్యార్థుల ప్రయోజనార్థం విజయవాడలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేసిన యూట్యూబ్ ఛానల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇగ్నో కోర్సుల్లో ప్రవేశాలు, ఫీజుల చెల్లింపు, పేపర్ల ఎంపిక, అధ్యయన కేంద్ర సమయాలు, కౌన్సిలర్ల పాత్రపై అధ్యయన కేంద్ర సమన్వయకర్త ఏ భాను మురళీధర్ వివరించారు. కార్యక్రమంలో ఇగ్నో సీనియర్ కౌన్సిలర్ బీవీహెచ్‌కే కామేశ్వరశాస్త్రి, ఎంఎస్ నారాయణ, డాక్టర్ కె. కొండయ్య,కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, అధ్యాపకులు డాక్టర్ పి.దేవేంద్రగుప్తా, పి.నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ పేలి బాలికకు తీవ్ర గాయాలు

చార్జింగ్ పెట్టి వీడియోలు చూస్తుండగా ఘటన



తెగిపోయిన బాలిక చేతివేళ్లు

బెల్లంకొండ: చేతిలోని మొబైల్ ఫోన్ పేలి 11 ఏళ్ల బాలిక తీవ్రంగా గాయపడిన ఘటన పల్నాడు జిల్లా ఎమ్మాజీగూడెం గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుంచాల వెంకటేశ్వరరావు కుమార్తె వీరలక్ష్మి శనివారం సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన తర్వాత రోజూ మాదిరిగానే ఇంట్లో ఉన్న తండ్రి స్మార్ట్ ఫోన్ తీసుకుని వీడియోలు చూస్తోంది. చార్జింగ్ అయిపోవడంతో చార్జింగ్ పెట్టి సెల్ ఫోన్ చూస్తుండగా అది ఒక్కసారిగా పెద్ద శబ్దంతో చేతిలో పేలిపోయింది. వీరలక్ష్మి కుడి చేయి, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. చేతి వేళ్లు రెండు పూర్తిగా తెగిపోయి, నుజ్జునుజ్జయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు బాలికను 108 వాహనంలో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం గుంటూరు తరలించారు.

పేద బ్రాహ్మణుల వ్యాపార వృద్ధికి సొసైటీ

ఇద్దరు చిరు వ్యాపారులకు ఆర్థిక సాయం



నగదు చెక్కు అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణుల అభ్యున్నతికి రాష్ట్రంలో తొలిసారిగా బ్రాహ్మణ అభివృద్ధి సొసైటీని ఏర్పాటు చేసినట్లు సొసైటీ వ్యవస్థాపకుడు ముత్తనపల్లి శివకృష్ణప్రసాద్ తెలిపారు. ప్రకాష్ నగర్‌లోని సొసైటీ కార్యాలయంలో ఆదివారం ఇద్దరు చిరు వ్యాపారులకు రూ.33 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా శివకృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ కుటుంబాలు వ్యాపార రంగంలో అభివృద్ధి చెందేందుకు రాష్ట్రంలో తొలిసారిగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో సొసైటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సొసైటీ ప్రతినిధి శ్రీగిరిరాజు నాగేశ్వరరావు తమ పథకానికి రూ.11 లక్షలు ఆర్థిక సాయం అందించారని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సొసైటీ కార్యాలయాలను ఏర్పాటు చేసి, కో ఆర్డినేటర్లను నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు శ్రీగిరిరాజు నాగేశ్వరరావు, కోట సాంబశివరావు, కాశీనాథుని సుబ్రహ్మణ్యం, మేళ్లచెరువు సతీష్, కేవీ పురుషోత్తమరావు, హారిక పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



అద్దంకి రూరల్: ఆగిఉన్న ఇటుక ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన అద్దంకి మండలంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. దర్శి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త బ్రహ్మం చౌదరి కారులో దర్శి నుంచి గుంటూరు వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో అద్దంకి మండలంలోని జార్లపాలెం గ్రామ సమీపంలో ఆగిఉన్న ఇటుక లోడు ట్రాక్టర్‌ను ఢీకొట్టటంతో బ్రహ్మయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో హైవే అంబులెన్స్‌లో ఒంగోలు తరలించారు.